క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి సహకరించండి

మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

నవాబుపేట: ప్రత్యేక తెలంగాణ అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రతి పక్ష నేతలకు కనిపించడం లేదా అని మండల సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతున్నామని, గ్రామం మొత్తం అంతర్గత మురుగు కాలువలు నిర్మించామని, సీసీరోడ్లు కొన్ని మాత్రమే మిగిలిపోయాయని పేర్కొన్నారు. అనేక సంక్షేమ పథకాలతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, అలాంటి రాష్ట్రంలో అభివృద్ధి జరగడం లేదని కాంగ్రెస్ నేతలు ఆరోపించడం ఎంతవరకు సమంజసమని వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. జిల్లా స్థాయిలో ఎల్లకొండ గ్రామానికి 3 అవార్డులు వచ్చాయని, నేషనల్ అవార్డుకు సైతం పరిశీలనలో ఉందని, ఆరోపణలు మానుకొని కాంగ్రెస్ నేతలు గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు. ఉప సర్పంచ్ మానస, వార్డు సభ్యులు, నర్సిహ్మారెడ్డి, లక్ష్మమ్మ, బాబురావ్, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మి, విజయ్‌రెడ్డి, లావణ్య పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



సీఐని సన్మానిస్తున్న ఎంఐఎం నాయకులు

కొడంగల్ రూరల్: సీఐ రాములును శనివారం ఆయన కార్యాలయంలో ఎంఐఎం నియోజక వర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్, పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు షేక్ రోమస్, ఎండీ.ముర్తుజా, హుస్సేన్, సయ్యద్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి స్థలం కేటాయించండి



ఆలయ ఈఓకు వినతిపత్రం అందజేస్తున్న శంకర్ యాదవ్

తాండూరు టౌన్: శ్రీశైలం పుణ్య క్షేత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడానికి శాశ్వత స్థలాన్ని కేటాయించాలని సాయిపుత్ర సేవా సంస్థ వ్యవస్థాపకుడు బావనోళ్ల శంకర్ యాదవ్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఆలయ ఈఓకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎనిమిది సంవత్సరాలుగా భక్తులకు సంస్థ ఆధ్వర్యంలో శ్రీశైలంలో అన్నదానం చేస్తున్నామని, కార్యక్రమ నిర్వహణకు ఏర్పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని స్థలాన్ని కేటాయించాలని విన్నవించుకున్నట్లు ఆయన తెలిపారు. దీనికి ఈఓ సానుకూలంగా స్పందిస్తూ స్థలాన్ని కేటాయిస్తామని చెప్పారన్నారు.


బస్‌పాస్ కౌంటర్‌ను వినియోగించుకోవాలి



బస్‌పాస్ కౌంటర్‌ను ఏర్పాటు చేసిన అధికారులు

కుల్కచర్ల: విద్యార్థులు బస్‌పాస్ కౌంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని పరిగి డిపో అసిస్టెంట్ మేనేజర్ సోమ్లా, కుల్కచర్ల బస్టాండ్ ఇన్‌చార్జి ప్రసాద్‌లు చెప్పారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్‌పాస్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి నెల రెండో శనివారం కౌంటర్ తెరుస్తామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది బాలు, వెంకటేశం, విశ్వనాథ్ గౌడ్, రఘుచారి పాల్గొన్నారు.

రథోత్సవానికి ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సంఘం నాయకులు

కొడంగల్: ఆదివారం జరగనున్న పెద్దమ్మ తల్లి పలహారం బండి రథోత్సవానికి రావాలని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డికి ముదిరాజ్ సంఘం నాయకులు శనివారం ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో డీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారీ, సామాజిక కార్యకర్త మురహరి వశిష్ట, ముదిరాజ్ సంఘం నాయకులు బాలరాజు, నరేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నీకింత.. నాకెంత!



తహసీల్దార్ కార్యాలయం వద్ద దరఖాస్తు దారులు (ఫైల్)

'లక్ష'ణంగా మొదలైన దందా
- రంగంలోకి దిగిన బ్రోకర్లు
- కేటగిరీలో లేని బీసీలకు గాలం

దౌల్తాబాద్: వెనుకబడిన తరగతులకు (బీసీ), చేతి వృత్తుల వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సహాయం ప్రకటించడం, దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ ముగియడం జరిగిపోయింది. ఇక మిగిలింది అర్హులకు సాయం అందజేయడమే తరువాయి. అయితే ఇక్కడ దళారులు రాజ్యం కొనసాగుతున్నట్లు సమాచారం. 'నీకు లక్ష ఇప్పిస్తే.. నా కెంత' అంటూ బేరసారాలు సాగిస్తుండడం గమనార్హం. తొలి విడతలో 15 ప్రత్యేక కులాలతో పాటు ఎంబీసీ కేటగిరీలకు అవకాశం కల్పిస్తుండగా.. బ్రోకర్లు మాత్రం ఇతర కేటగిరీల్లోని బీసీలకు సైతం స్కీం వస్తుందని మాయమాటలు చెబుతూ కమీషన్లకు తెరతీసినట్లు తెలుస్తోంది.

రూ.20వేల వరకు కమీషన్

బీసీ కుల వృత్తుల ప్రోత్సాహం రూ.లక్ష పథకం ఆదిలోనే నీరుగార్చే కుట్ర జరుగుతోంది. దరఖాస్తుల పరిశీలన గడువు ముగియడంతో దళారులు రంగంలోకి దిగారు. 'స్కీం నిబంధనలతో పని లేకుండా కమీషన్ ముట్టజెబితే రూ.లక్ష చెక్కు వచ్చేస్తది' అని వృత్తి దారులను నమ్మిస్తున్నారు. ఇదే విషయమై శనివారం ఓ బీసీ కులానికి చెందిన వ్యక్తిని స్కీం గురించి వివరణ కోరగా.. అక్కడే ఉన్న ఓ బ్రోకర్ రూ.25వేలు ఇస్తే ఇప్పిస్తానని చెప్పడం గమనార్హం.

600 అర్జీలు.. 460 అర్హత

రూ.లక్ష స్కీం దరఖాస్తుల ప్రక్రియ గత నెలలో ముగిసింది. మండలంలోని మొత్తం 33 గ్రామ పంచాయతీల్లో 460 అర్హత పొందినట్లు అధికారులు గుర్తించారు. అర్హత కలిగిన దరఖాస్తులను కలెక్టర్ నేతృత్వంతో పరిశీలిస్తారు. అయితే ఇప్పటికే మండలానికి 30 మందికి మంజూరైన బీసీ రూ.లక్ష జాబితాలో కొంత మంది నుంచి రూ.15నుంచి రూ.20వేలు వసూలు చేసినట్లు సమాచారం.

ఒక్క రూపాయి ఇవ్వొద్దు



రూ.లక్ష స్కీం కోసం ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వొద్దు. మండలంలో ఇప్పటి వరకు ఇద్దరికీ మాత్రమే చెక్కులు అందజేశాం. అయితే పంపిణీ కార్యక్రమం శనివారం ప్రారంభించాల్సి ఉండగా.. తమకు కలెక్టర్ కార్యాలయం నుంచి జాబితా రాలేదు. వస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపిణీ చేస్తాం. – తిరుమలస్వామి, ఎంపీడీఓ

చట్టాలపై అవగాహన తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీరామ్

మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్

కొడంగల్ రూరల్: రైతులు.. తమకు సంబంధించిన చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్ అన్నారు. శనివారం కొడంగల్ మండలం పర్సాపూర్ రైతువేదికలో ఏర్పాటు చేసిన వ్యవసాయ న్యాయ సహాయ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందుతున్నాయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. రైతు హక్కు చట్టం గురించి వివరించారు. న్యాయ సలహాల కొరకు రైతులు రైతువేదికలోని కోర్టు సిబ్బందిని అడిగి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం వేదికలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ సయ్యద్ అంజద్, రైతులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల పనులు షురూ



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీటీసీ

బొంరాస్‌పేట: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ పథకం కింద మరుగుదొడ్ల నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. శనివారం బొంరాస్‌పేట మండలం చౌదరిపల్లిలో ఎంపీటీసీ సభ్యుడు శేరినారాయణరెడ్డి, సర్పంచ్ వెంకటమ్మ గుంతలు తీసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడారు. ఇంటింటికీ మరుగుదొడ్డి కలిగి ఉండాలని, అలాగే ఇంటింటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేయించి కాంపోస్టు ఎరువులు తయారు చేయించాలన్నారు.

కళారంగంలో చిన్నారులు ఎదగాలి

ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి



డ్యాన్స్ అకాడమీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి

తాండూరు టౌన్: డ్యాన్స్ కళాత్మకమైందని, పాశ్చాత్య నృత్యంతో పాటు సంప్రదాయ నృత్యాలు అందరినీ ఆకట్టుకుంటాయని ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని మర్రిచెట్టు కూడలి వద్ద డ్యాన్స్ మాస్టర్ రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్యాన్స్ అకాడమీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిర్వాహకులు వివిధ నృత్యాలతో పాటు తెలంగాణ సంప్రదాయ నృత్యాలను చిన్నారులకు నేర్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. చిన్నారులు డ్యాన్స్ నేర్చుకుని కళారంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అబ్దుల్ రవూఫ్, విజయలక్ష్మి, పరిమళ, రఘు, పాండు, అనిల్, ప్రవీణ్ రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



యంత్రాల పనితీరును వివరిస్తున్న డీటీ

బంట్వారం: కోట్‌పల్లి మండలం రాంపూర్‌లో శనివారం ఈవీఎంలపై డిప్యూటీ తహసీల్దార్ భరత్‌గౌడ్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ల పని తీరును వివరించారు. ఓటింగ్ యంత్రాలపై ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేస్తామని వెల్లడించారు.

కార్మికుల వెతలు పట్టని ప్రభుత్వం

- సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం: సీఐటీయూ
- కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



పరిగి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

పరిగి: పంచాయతీ కార్మికుల వెతలు ప్రభుత్వం, పాలకులు పట్టించుకోవడం లేదని, వారి సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటం ఆపమని కార్మిక సంఘం నాయకులు అన్నారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్మికులు గ్రామాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తారని, అలాంటి వారి సమస్యలను ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం నాయకులు, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్‌లో..

అనంతగిరి: సమస్యల సాధనలో భాగంగా జీపీ కార్మికులు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. వికారాబాద్‌లో జరుగుతున్న సమ్మెలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పాల్గొని మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు పెంచాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, హసన్, బాబు, రాజు, శ్రీశైలం, అశోక్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. జీపీ కార్మికుల సంఘం బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల్ మండలాల అధ్యక్షుడు నర్సింహులు, సాయిలు, మల్లేశ్ యాదవ్, కార్యదర్శులు సుభాన్, గౌస్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు గొప్పలు.. సర్పంచుల తిప్పలు

- జీపీలకు అందని కంటివెలుగు ఫైసలు
- అప్పులతో కార్యక్రమాల నిర్వహణ
- నిధుల విడుదల జాప్యంపై ఆందోళన



కంటివెలుగు కార్యక్రమం (ఫైల్)

కుల్కచర్ల: 'సర్కారు గొప్పలు.. తిప్పలు తెచ్చిపెడుతున్నాయి' అని సర్పంచులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ప్రతి అంశంలో తమతో ఖర్చులు పెట్టిస్తూ.. నిధుల విడుదలలో నాన్చుడు ధోరణి అవలంభిస్తుందోని ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన కంటివెలుగు రెండో విడత కార్యక్రమాన్ని గ్రామపంచాయతీలు నిర్వహించాలని, అందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం అందజేస్తుందని అధికారులు పేర్కొన్నారు. కానీ కార్యక్రమం ముగిసినా.. నేటికీ డబ్బులు అందలేదని వాపోతున్నారు.

అట్టహాసంగా..

అంధత్వ నివారణే లక్ష్యంగా కంటివెలుగు రెండో విడత కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టగా.. కుల్కచర్ల మండలంలోని 44 గ్రామపంచాయతీల్లో 100రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమాలను ప్రజాప్రతినిధుల సమక్షంలో అట్టహాసంగా ప్రారంభించారు. ప్రత్యేక అధికారులను నియమించి కార్యక్రమాలను పర్యవేక్షింపజేశారు.

ఎనిమిది నెలలు కావస్తున్నా..

కంటివెలుగును జనవరి 19న ప్రారంభించి, జూన్ 9న ముగించింది. వారానికి 5రోజుల పాటు పని చేస్తూ వంద రోజులు విధులు నిర్వహించిన వైద్య సిబ్బంది.. గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేసి, ప్రజలకు కంటి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమం ప్రారంభించి 8మాసాలు గడిచినా నేటికీ నిధుల విడుదల అనేది అర్థం కాని ప్రక్రియగా మిగిలింది. జీపీల్లో జమ అవుతాయని ఒకసారి, మండల పరిషత్ ద్వారా నిధులు వస్తాయని మరోసారి అధికారులు చెబుతుండగా.. ఖర్చులు పెట్టిన ప్రజాప్రతినిధులకు మాత్రం రిక్తహస్తంమే మిగులుతోంది.

నిర్లక్ష్యం బాధాకరం..



ప్రభుత్వ ఆదేశానుసారం.. కంటివెలుగును అట్టహాసంగా ప్రారంభించాం. నిత్యం రూ.3వేలు ఖర్చు చేసి, సదుపాయాలు కల్పిస్తూ.. వైద్య సిబ్బందికి, గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించాం. కానీ తమకు విడుదల చేయాల్సిన నిధుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం బాధాకరం. – సౌమ్యారెడ్డి, సర్పంచ్ కుల్కచర్ల

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాం..



జీపీల్లో నిధులు లేకున్నా అప్పులు చేసి, గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. సంక్షేమ పథకాలు, కార్యక్రమాల విజయవంతం కోసం ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కానీ చేసిన పనులకు నిధుల విడుదలలో జాప్యం చేయడం ఎంతవరకు సమంజసం. – శిరీషారెడ్డి, బండవెల్కిచర్ల సర్పంచ్

త్వరలో జీపీ ఖాతాల్లో జమ



కంటివెలుగు కార్యక్రమానికి సంబంధించిన నిధు లు ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్నాయి. ఒకటి, రెండు రోజుల్లో జీపీ ఖాతాల్లో జమయ్యే అవకాశం ఉంది. అనంతరం గ్రామాలు ఖర్చు చేసిన బిల్లులను పరిశీలించి చెల్లింపులు చేపడతాం. – ఖరీం, ఎంపీఓ కుల్కచర్ల

పదవి కాలం దగ్గరపడే.. బిల్లులు రాకపాయే

సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు



మాట్లాడుతున్న ఎంపీపీ అరవింద్‌రావు

పరిగి: 'పదవి కాలం దగ్గర పడుతోంది. అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయించాం. కానీ చేసిన పనులకు బిల్లులు రాలేదు' అని పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అరవింద్‌రావు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో బర్కత్‌పల్లి సర్పంచ్ రాంచంద్రయ్య మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన డబ్బులు రాలేదని సభ దృష్టికి తెచ్చారు. ఎంపీటీసీ ఉమాదేవి మాట్లాడుతూ ఖుదావన్‌పూర్ గ్రామం ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ నీరు సరఫరా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, బసిరెడ్డిపల్లి, కాళ్లాపూర్‌లో విద్యుత్ తీగలు చేతులకు అందే ఎత్తులో ఉన్నాయని, ఇలా పలు గ్రామాల ప్రజాప్రతినిధులు చేసిన పనులకు బిల్లులు, తదితర సమస్యలను సభలో ఎన్నిసార్లు ప్రస్తావించినా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు.

సమన్వయంతో పనిచేయాలి: ఎంపీపీ

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ అరవింద్‌రావు అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, సౌకర్యాల కల్పనకు నిధులను మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషగిరిశర్మ, జెడ్పీటీసీ హరిప్రియ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో చేవెళ్ల నుంచి పోటీ చేస్తా

మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం



మోకిల, కొండకల్ గ్రామాల్లో పర్యటిస్తున్న కెఎస్ రత్నం

శంకర్‌పల్లి/చేవెళ్ల: వచ్చే ఎన్నికల్లో చేవెళ్ల నుంచి పోటీ చేస్తానని, సీఎం కేసీఆర్ తనకే టికెట్ ఇస్తారనే నమ్మకం ఉందని మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం అన్నారు. శనివారం పల్లెపల్లెకు రత్నం అన్న అనే కార్యక్రమంలో భాగంగా శంకర్‌పల్లి మండలం కొండకల్, కొండకల్‌తండా, మోకిల, మోకిలతండాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాలు అభివృద్ధి చెందాయని, ఎన్నో పథకాలను ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీయే అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సింహ, కొండకల్ ఎంపీటీసీ సురేందర్‌రెడ్డి, మోకిల ఎంపీటీసీ సరిత, కౌన్సిలర్ శ్రీనాథ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, నాయకులు బయన్న, శ్రీనివాస్ రెడ్డి, గోవింద్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తే రోగాలకు చెక్

కొందుర్గు: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలను అదుపు చేయవచ్చని ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. కొందుర్గు మండల కేంద్రంలో శనివారం కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందుర్గు గ్రామం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామంగా ఎంపికై ందని, ఇక నుంచి గ్రామంలో చెత్త చెదారం పడేయకూడదని సూచించారు. వీధుల్లో మురుగునీరు రాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. గ్రామంలో బహిరంగ మల, మూత్ర విసర్జన నిషేధించామని పేర్కొన్నారు. గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ లాలయ్య, పంచాయతీ కార్యదర్శి సురేఖ, టీఏ రజిత, మాజీ ఎంపీటీసీ యాదయ్య పాల్గొన్నారు.

దళితబంధును వ్యతిరేకిస్తే దాడులే

బీఆర్‌ఎస్ నేతల హెచ్చరిక

కొత్తూరు: దళితుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు పథకాన్ని వ్యతిరేకించే పార్టీలపై దాడులు చేస్తామని మండల బీఆర్‌ఎస్ నాయకులు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న దళితబంధుతో దళితులు ఆర్థికంగా బలపడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తమ ఉనికిని కాపాడుకోవడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికై న ఆరోపణలు మానుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బీజేపీ, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దళితబంధును అమలు చేసి దళితులపై ఉన్న ప్రేమను చాటాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ, యాదగిరి, మధుసూదన్‌రావు, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో..

- తరిస్తున్న 300మంది భక్తులు
- రెండు దశాబ్దాలుగా వేంకటేశ్వరుని సన్నిధికి
- నేడు రేగడిమైలారంలో ప్రత్యేక కార్యక్రమాలు



టీటీడీ దేవస్థానంలో సేవకులు

బొంరాస్‌పేట: శ్రీవారి సేవకులు.. తిరుమల తిరుపతి దేవస్థాన సన్నిధి భక్తులకు సేవలందిస్తే స్వామివారికి సేవచేసినట్లు భావించే పుణ్య పునీతులు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన దైవసేవకులు, ఆధ్యాత్మిక భక్తులు టీటీడీలో యేటా శ్రీవారి సేవలో పాల్గొంటారు. అందుకు బొంరాస్‌పేట మండలం రేగడిమైలారానికి చెందిన టీటీడీ వలంటీరు, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌గౌడ్ కీలక భూమిక పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం రేగడిమైలారంలో అన్నదానం, జ్ఞాపికల అందజేత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

పద్దెనిమిదేళ్లుగా..

టీటీడీ ఆర్గనైజర్ చంద్రశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో కొడంగల్ ప్రాంతం నుంచి 2005 సంవత్సరంలో తొలిసారిగా రేగడిమైలారం నుంచి శ్రీవారి సేవకు 15మంది వెళ్లారు. అప్పటినుంచి యేటా ఒకటి లేదా రెండు బృందాలు శ్రీవారిసేవకు సేవకు వెళ్తున్నాయి. అలాగే వికారాబాద్ నుంచి తాండూరు, యాలాల మండలం దేవనూరు, దోమ మండలం మోత్కూరు, కొడంగల్, కోస్గి, చిల్మల్ మైలారంతో పాటు తదితర ప్రాంతాల నుంచి ఇప్పటివరకు సుమారు 300మందికి పైగా వెళ్లివస్తున్నారు.

సేవలివే..

టీటీడీకి వెళ్లే సేవకులు భక్తులకు అన్నదానం, వైకుంఠం-2లో ప్రసాదాల పంపిణీ, తలనీలాల సమర్పణ, ప్రాంగణం, వైద్యసేవలు, భద్రత విభాగంలో తనిఖీ, క్యూలైన్‌లో సేవలిందిస్తారు. వృద్ధులు, రోగులకు సపర్యలు చేస్తుంటామని సభ్యులు చెప్పారు.

అరుదైన భాగ్యం



దైవ కార్యక్రమాలంటే చాలా ఇష్టం. ఆధ్యాత్మిక సేవలు, పూజలు, ఆలయాల నిర్మాణాల కార్యక్రమాల్లో పాల్గొంటాము. శ్రీవారి సేవకు జిల్లాతో పాటు హైదరాబాద్, శంకర్‌పల్లి, జోగిపేట, కర్ణాటక రాష్ట్రం సేడం ప్రాతాల నుంచి సేవకులను శ్రీవారి చెంతకు తీసుకెళ్లాను. – చంద్రశేఖర్‌గౌడ్, రిటైర్డ్ పీడీ/టీటీడీ వలంటీరు

టీటీడీలో క్షేత్ర సందర్శన

శ్రీవారి సేవకు వెళ్లినవారికి టీటీడీలో క్షేత్ర స్థాయిలో దర్శనం ఉచితంగా ఉంటుంది. తిరుమల గుట్టపై వెలసిన పాపవినాశనం, వేణుగోపాల స్వామి మందిరం, ఆకాశగంగా, స్వామివారి మ్యూజియం సందర్శన ఉంటుందని సేవకులు తెలిపారు. తిరుపతి నుంచి శ్రీకాళహస్తి, పద్మావతి అమ్మవారు, వేణుగోపాలస్వామి మందిరం, హరే రామ హరేకృష్ణ, కోదండరామస్వామి, గోవిందరామస్వామి ఆలయాలు, గోల్డెన్ టెంపుల్ (వేలూరు తమిళనాడు), కానిపాక విఘ్నేశ్వరుని దర్శనం ఉంటుందని పేర్కొన్నారు.